క్లుప్తంగా

సమతుల్య ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం



సదస్సులో అవగాహన కల్పిస్తున్న పార్థసారథి

కాకినాడ రూరల్: సంపూర్ణ ఆరోగ్యానికి సమతుల్య ఆహారం అవసరమని పోషకాహార నిపుణుడు పి.పార్థసారథి అన్నారు. స్థానికరమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆరోగ్య అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మానవాళిపై రోజుకో కొత్త జబ్బు దాడి చేస్తున్నందున, ఆరోగ్యానికి మూలమైన పోషకాహారంపై శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, ప్రసాద్ నాయుడు, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ పరికరాల పంపిణీ



వృద్ధురాలికి వినికిడి యంత్రం ఇస్తున్న ఎమ్మెల్యే నానాజీ

కాకినాడ రూరల్: వాకలపూడిలోని ఉమా మనోవికాస కేంద్రంలో ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆర్థిక సహకారంతో దివ్యాంగులకు కృత్రిమ పరికరాలను బుధవారం పంపిణీ చేశారు. సంస్థ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మూడు చక్రాల సైకిళ్లు, కృత్రిమ కాళ్లు, కాలిపర్సు, వీల్‌చైర్స్, పీసీ వీల్ చైర్లు, వినికిడి యంత్రాలను సుమారు 75 మందికి ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు, కె.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్పవరంలో మెగా వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

కాకినాడ రూరల్: ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్(ఏఐసీసీ), మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ ఎండీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో సర్పవరం గ్రామం ఎసోల్కొల్ వర్షిప్ ఆవరణలో బుధవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు సుధానంద, నవ్య మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించగా, హాసిని డెంటల్ క్లినిక్ వైద్యులు దంత పరీక్షలు చేశారు. పిఠాపురం సీఎంసీ ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్య సేవలు పొందిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు రిక్కీ గూటమ్, వైద్యులు తన్మయి, రామచంద్ర, శ్రీనుబాబు, స్వాతి, చార్లెస్, సంతోష్, కరుణాకర్, మోనోమోసెట్టి, కుమార్, దేవిశెట్టి సల్మాన్, వీరేంద్ర, భద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించకపోతే కఠిన చర్యలు



పిఠాపురం రోడ్డులో ఆక్రమణదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

కాకినాడ రూరల్: ఆటంకంగా పరిణమించిన ఆక్రమణలను తొలగించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కుమారి హెచ్చరించారు. కాకినాడ–పిఠాపురం రోడ్డును ఆనుకుని తిమ్మాపురం పరిధిలో ఉన్న ఆక్రమణలపై బుధవారం రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆక్రమణదారులతో మాట్లాడారు. వారం రోజుల్లో వాటిని తొలగించకపోతే ఆక్రమణదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను నిలుపుదల చేస్తామని హెచ్చరించారు.

రెవెన్యూ సదస్సా.. మజాకా..!?

- ఏ పదవీ లేని కూటమి నాయకులకు ఆహ్వానం
- అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న అధికారులు



గొర్రిపూడి రెవెన్యూ సదస్సులో అధికారులతో వేదికపై ఆశీనులైన కూటమి నాయకులు

కరప: భూ సమస్యలను పరిష్కరిస్తామంటూ ప్రభుత్వం గొప్పలు చెబుతున్న రెవెన్యూ సదస్సులు అపహాస్యం పాలవుతున్నాయి. కీలక అధికారులు, ప్రజాప్రతినిధులతో పటిష్టంగా నిర్వహించాల్సిన సదస్సులు కాస్తా.. పార్టీ కార్యక్రమాలుగా మారిపోతున్నాయి. సంబంధిత అధికారులు కూడా కూటమి నేతల ప్రాపకానికి అత్యుత్సాహం ప్రదర్శిస్తుండడంతో.. జనం విస్తుపోతున్నారు. మండలంలోని గొర్రిపూడిలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సులు, సమావేశాలు జరుగుతాయి ఇందులో వింత ఏముందనుకుంటే పొరబడినట్టే. గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వాదేశాల మేరకు ఈ నెల 13వ తేదీ నుంచి మండలంలో రోజుకొక గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించి, రైతులను ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. కాకపోతే ఏ రెవెన్యూ సదస్సు చూసినా, అధికారులు ఏ పదవీ లేని కూటమి నాయకులను పిలిచి మరీ కూర్చోబెడుతున్నారు.

అడ్డూ అదుపూ లేకుండా..

గ్రామాల్లో ఎమ్మెల్యే అనుచరుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్‌లను పక్కనపెట్టి, కనీసం వార్డు మెంబరు కూడా కానీవారు అధికారులపై పెత్తనం చలాయిస్తున్నారు. వారు చెప్పినవి చేయకపోతే బదిలీ చేయిస్తామని బెదిరింపులు ఎదురవుతున్నాయి. మామూళ్లు ఇవ్వందే ఎవరినీ వ్యాపారాలు చేయనివ్వడం లేదన్న ఆరోపణలూ లేకపోలేదు.

స్వామిభక్తిని చాటుకుంటూ..

కొత్త ప్రభుత్వం వచ్చాక మండల స్థాయి అధికారుల నుంచి గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, అటెండర్ల వరకు తమకు అనుకూలమైన వారిని ఉంచుకున్నారు. అనుకూలంగా లేనివారిని బదిలీ చేయించి, తమకిష్టమైన వారిని రప్పించుకున్నారు. అంతే బదిలీపై వచ్చిన అధికారులు కూడా ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్‌లను పక్కన పెట్టి, కూటమి నాయకులు చెప్పిందే వేదంలా భావించి, ఆయా పనులు చేస్తూ స్వామిభక్తిని చాటుకుంటున్నారు. ఏ పదవీ లేకపోయినా స్టేజ్‌పైకి ఎందుకు ఆహ్వానిస్తున్నారని ఎవరైనా అధికారులను అడుగుతుంటే, ఆ ఒక్కటీ అడక్కండి, పైనుంచి(నియోజకవర్గ నాయకుడు) ఆదేశాలు వచ్చాయి, ఎక్కడా అనకండంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు.

ఓవర్ యాక్షన్ భరించలేక..

కూటమి నాయకుల ఓవరాక్షన్ భరించలేక వైఎస్సార్ సీపీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశాలకు, సదస్సులకు రావడం మానేశారు. పింఛన్ల పంపిణీ మొదలు ఏ సమావేశం జరిగినా కూటమి నాయకులు మాత్రం ఠంచన్‌గా హాజరై, ఫొటోలు దిగి ఎంచక్కా వెళ్లిపోతున్నారు. చివరి వరకు ఉండి, ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారంటే అదీ లేదు. తాజాగా బుధవారం గొర్రిపూడిలో జరిగిన రెవెన్యూ సదస్సుకు జనసేన పార్టీకి చెందిన ఇద్దరిని, టీడీపీకి చెందిన ఒకరినీ స్టేజ్‌పైకి పిలిచి కూర్చోబెట్టిన రెవెన్యూ అధికారుల తీరుపై జనం ముక్కున వేలేసుకుంటున్నారు. పదవి లేకపోయినా స్టేజ్‌పై కూర్చోపెడుతున్నారు.. ఇదేమి ప్రొటోకాల్ అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



సీపీఆర్ విధానాన్ని వివరిస్తున్న డాక్టర్ అడ్డాల

కాకినాడ సిటీ: ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండడం వల్ల గుండెపోటు నుంచి రక్షించుకోవచ్చని ప్రముఖ దంత వైద్య నిపుణుడు అడ్డాల సత్యనారాయణ అన్నారు. ఐడీఏ, కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం సంయుక్తాధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, గుండెపోటు కారణంగా ఏడాదిలో దాదాపు 5.8 కోట్ల మంది మరణిస్తున్నారన్నారు. గుండెపోటు సమయంలో రోగికి ఆకస్మిక రక్త ప్రసరణ, శ్వాసను పునరుద్ధరించడానికి అత్యవసర ప్రక్రియ అయిన హృదయ శ్వాసకోస పునరుజ్జీవనం (సీపీఆర్)పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్డియోపల్మోనరీ రిససిటేషన్ (సీపీఆర్) వ్యక్తి గుండె కొట్టుకోవడం స్తంభించినప్పుడు లేదా ఊపిరితిత్తులు శ్వాస తీసుకోలేని స్థితిలో ఉన్నప్పుడు వెంటనే ఆ చర్యల పునరుద్ధరణకు చేసే అత్యవసర ప్రక్రియ అని వివరించారు. గుండెపోటు సంభవించినప్పుడు ప్రాణాలను కాపాడటానికి ఇది చాలా కీలకమైన, ప్రాథమిక విధానమన్నారు. సీపీఆర్ చేసే విధానాన్ని విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించి, వారికి సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ సి సత్యనారాయణ కలిసి అడ్డాల సత్యనారాయణను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాల సెక్రటరీ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తేజేశ్వరరావు, గౌరీప్రియ తదితరులు పాల్గొన్నారు.

రైస్ పుల్లింగ్ కాయిన్ పేరిట మోసం



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

- కాంట్రాక్టర్‌ను బురిడీ కొట్టేందుకు యత్నం
- రూ.20 లక్షలు ఇస్తే రూ.20 కోట్లు సంపాదించవచ్చని నమ్మబలికిన ముఠా
- అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఏడుగురి అరెస్టు

కాకినాడ రూరల్: ఈజీ మనీ కోసం.. తిమ్మిని బమ్మిగా నమ్మించే ముఠాల మాటలకు ఎందరో మోసపోతున్నారు. కొందరు తాము మోసపోయినట్టు పోలీసులను ఆశ్రయిస్తుండగా, మరికొందరు పరువు పోతుందని తమలోనే దాచుకుంటున్నారు. ఎదుటి వారి బలహీనతను సొమ్ము చేసుకునేందుకు రాబందుల్లా కొన్ని ముఠాలు నిత్యం వల వేస్తూనే ఉంటాయి. తమ వద్ద ఉన్న రైస్ పుల్లింగ్ కాయిన్‌ను ఇస్తామని, రూ.20 కోట్లు సంపాదించుకోవచ్చని, ఇందుకు రూ.20 లక్షలు ఇస్తే సరిపోతుందని నమ్మబలికిన ముఠా మాటలకు కాకినాడ సర్పవరం జంక్షన్ వద్ద రమణయ్యపేటకు చెందిన కాంట్రాక్టర్ మోసపోయాడు. వెంటనే నిజం తెలుసుకుని ముఠా సభ్యులను ఎదురించాడు. ఇందుకు సంబంధించి సర్పవరం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రమణయ్యపేటకు చెందిన కాంట్రాక్టు పనులు చేసుకుని జీవనోపాధి పొందే పెనుమత్స నాగరాజు సుమారు ఏడాది క్రితం అరకు పర్యటనకు వెళ్లాడు. అక్కడ కిల్లో శ్యాంసన్, పిట్టా గుండన్న, గోపినాయక్ త్రినాథరావు, పాంగి రోహన్‌రావు, గోపినాయక్ తిరుపతిరావు, కర్బలయ్య సుజాత, సెట్టి బుల్లమ్మ తదితరులు పరిచయమయ్యారు. వారు తమ వద్ద కోట్ల రూపాయలు సంపాదించే రైస్ పుల్లింగ్ కాయిన్ ఉందని, దానిని అమ్మితే ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని నమ్మబలికారు. కాయిన్‌ను చూపారు. తాము చెప్పినట్టు రూ.20 లక్షలు పెట్టుబడి పెడితే, రూ.20 కోట్లు సంపాదించుకోవచ్చని నమ్మించడంతో, నాగరాజు, స్నేహితులకు కలిసి వారు చెప్పిన విధంగా బ్యాంక్ ఖాతాల్లో దఫదఫాలుగా రూ.20 లక్షలు జమ చేశారు. ఈ నెల 17న కాయిన్ పట్టుకుని వస్తున్నామని, డబ్బు సిద్ధంగా ఉంచాలని కోరారు. వారు చెప్పిన ప్రాంతంలో నాగరాజుకు ఒక రాయి కాయిన్ అందించారు. దానిపై సీతారామ పట్టాభిషేకం ఫొటో ముద్రించి ఉండగా, అది రైస్ పుల్లింగ్ కాయిన్ కాదని వారిని నిలదీయడంతో, చాకుతో బెదిరించి రూ.50 వేలతో నిందితులు పరారయ్యారు. దీనిపై బాధితుడు సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీఐ పెద్దిరాజు కేసు నమోదు చేశారు. కాకినాడ సురేష్ నగర్ పార్కు వద్ద అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన నిందితులు ఏడుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.50 వేల నగదు, చాకు స్వాధీనం చేసుకున్నామని సీఐ బుధవారం రాత్రి తెలిపారు.

వెల్లివిరిసిన క్రీడా చైతన్యం

- ముగిసిన మూడు రోజుల ఏపీఎస్పీ క్రీడలు
- ఉత్సాహపర్చిన ఎస్పీ, కలెక్టర్
- సందడిగా సాగిన ఆటలు



క్రికెట్ పోటీల్లో విజేత జట్టు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న కమాండెంట్ దీపిక

కాకినాడ రూరల్: క్రీడలు దేహధారుడ్యాన్ని పెంపొదించడంతో పాటు, మానసిక ఉల్లాసాన్నిస్తాయి. పోటీలో క్రీడాస్ఫూర్తి పరిపక్వతను చాటుతాయి. నిత్యం విధుల్లో బాధ్యతలను సవాల్‌గా భావించి ముందుకు సాగే ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పోలీసులకు వార్షికంగా నిర్వహించే క్రీడా పోటీలు వారిలో పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించాయి. స్థానిక రమణయ్యపేటలోని కాకినాడ మూడో బెటాలియన్ సిబ్బందికి కొత్తగా వచ్చిన కమాండెంట్ ఎం.దీపిక వార్షిక క్రీడా పోటీలను నిర్వహించడంతో, సిబ్బందిలో క్రీడాస్ఫూర్తి వెల్లివిరిసింది. సోమవారం ప్రారంభమైన క్రీడా పోటీలు మూడు రోజుల పాటు ఉత్సాహభరితంగా సాగాయి. పరుగు పందెం, క్రికెట్, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్,. త్రో బాల్ తదితర పోటీలను నిర్వహించడంతో, ఏడు కంపెనీల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలు, రన్నర్లతో పాటు, పాల్గొన్న క్రీడాకారులందరికీ సిబ్బంది నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి. విన్నర్లు, రన్నర్లకు కమాండెంట్ దీపిక కప్‌లు, ప్రశంసాపత్రాలు అందించి, ప్రోత్సహించారు. ముగింపు వేడుకల్లో ఆటపాటలు, క్యాంప్ ఫైర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అతిథులుగా హాజరైన ఎస్పీ విక్రాంత్ పాటిల్, కలెక్టర్ షణ్మోహన్ బెటాలియన్ సిబ్బందితో కలిసిపోయి సరదాగా గడిపారు.



క్రీడా పోటీల ముగింపులో భాగంగా టగ్ ఆఫ్ వార్‌లో తలపడుతున్న కమాండెంట్ దీపిక టీమ్



కమాండెంట్ దీపిక టీమ్‌తో టగ్ ఆఫ్ వార్‌లో తలపడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ప్రపంచానికి మార్గదర్శి భగవద్గీత



కరపత్రాలు, భగవద్గీత పుస్తకాలను ప్రదర్శిస్తున్న ప్రతినిధులు

కరప: ప్రపంచ మానవాళికి ధర్మమార్గం చూపించేది భగవద్గీత మాత్రమేనని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు అన్నారు. యండమూరు శివారు వడ్డిపాలెంలో బుధవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన భగవద్గీత అభ్యాసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భగవద్గీత చదివితే మానవులు ఎదుర్కొనే ప్రతి సమస్యకు పరిష్కార మార్గాన్ని చూపుతుందన్నారు. సంతోషం సంతృప్తిలోనే కలుగుతుందని, భగవద్గీత ద్వారా భగవంతుడు చెప్పిన మాటలను ఆచరిస్తే జీవితం ఆనందమయం అవుతుందన్నారు. వచ్చే నెల ఐదో తేదీన విజయవాడలో జరిగే హైందవ శంఖారావానికి ప్రతి గ్రామం నుంచి హాజరు కావాలన్నారు. ఈ సందర్భంగా భగవద్గీత పుస్తకాలను, హైందవ శంఖారావం కరపత్రాలను గ్రామస్తులకు పంచారు. ఫౌండేషన్ కరప, కాజులూరు మండలాల కన్వీనర్లు కాదా సత్యనారాయణ, కంచి గోవింద రాజు, గ్రామ కన్వీనర్ త్రిమూర్తులు పాల్గొన్నారు.

గొర్రిపూడి సదస్సులో ఐదు అర్జీలు

కరప: మండలంలోని గొర్రిపూడిలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. అర్జీదారులు అంతగా లేక సదస్సు వెలవెలబోయింది. ఐదుగురు రైతులు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చి వెళ్లిపోయారు. తహసీల్దార్ ఎన్.సత్యనారాయణ, రీ సర్వే డీటీ డి.దుర్గాప్రసాద్, మండల సర్వేయర్ ఎస్.రూపావతి పాల్గొన్నారు.

ఖోఖో టోర్నీలో ఐడియల్ ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థుల బృందం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): గుంటూరులో నిర్వహించిన జేఎన్‌టీయూకే కాకినాడ సెంట్రల్ జోన్ ఉమెన్ ఖోఖో పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్ బుధవారం తెలిపారు. ఈ నెల 16, 17 తేదీల్లో పోటీలు నిర్వహించగా, ఐడియల్ కళాశాల జట్టు విజేతగా నిలిచి ట్రోఫీ సాధించిందన్నారు. అలాగే సీఎస్ఈ విద్యార్థిని ఐశ్వర్య, ఈసీఈ విద్యార్థిని మౌనిక సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఉమెన్ ఖోఖో టోర్నమెంట్‌కు అర్హత సాధించారన్నారు..ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు, కరస్పాండెంట్ చిరంజీవి నికుమారి, డైరెక్టర్ జీవీ కృష్ణంరాజు, ఏవో జీవీకే వర్మ, పీడీ జి.కాశయ్య అభినందించారు.

ప్రణాళికాబద్ధంగా గ్రామాల సుస్థిరాభివృద్ధి



వివిధ అంశాలను వివరిస్తున్న సీనియర్ కార్యదర్శి చంద్రకళ



బాల్య వివాహాల నిరోధంపై ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్‌లు, అధికారులు

కరప: శిక్షణ ద్వారా అవగాహన కల్పించుకున్న అంశాల ద్వారా గ్రామాల్లో సుస్థిరాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవాలని ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ కార్యదర్శులు బి.చంద్రకళ, వై.రాంజీ హీరాలాల్ పంచాయతీరాజ్ అంశాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.అన్నపూర్ణ, కె.విజయలక్ష్మి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం, విద్యా వికాసంపై, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. చివరగా బాల్య వివాహాలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతామని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు

కాకినాడ సిటీ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంటులో ఎగతాళి చేసి, అహంకారంగా మాట్లాడటం దుర్మార్గమైన, దారుణమైన చర్య అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు తీవ్రంగా విమర్శించారు. ఈ మతోన్మాద చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రజలు, ప్రజాతంత్ర వాదులూ దీనిని ఖండించాలని బుధవారం ఆయన ఇక్కడ పిలుపునిచ్చారు. దీనికి అమిత్‌షా క్షమాపణ చెప్పాలన్నారు. డాక్టర్ అంబేద్కర్ పేరును అభ్యంతరకరంగా ప్రస్తావించడం తగదన్నారు. ఎన్నికల ముందు అంబేద్కర్ పేరు జపం చేసి, అధికారంలోకి వచ్చాక ఆయన పేరు ఎత్తకూడదని చెప్పటం సిగ్గు చేటన్నారు. నేటి మనువాద, మతోన్మాద ప్రభుత్వంలో రాజ్యాంగంపై, ప్రభుత్వ రంగ సంస్థలపై దాడి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ దాడులను వ్యతిరేకిస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దళిత, పీడిత వర్గాలకు అంబేడ్కర్ నిజంగా దేవుడని చెప్పారు. వెంటనే అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

రెవెన్యూ సమస్యలకు తక్షణ పరిష్కారం



ఎస్సీ పేటలో వృద్ధురాలితో మాట్లాడుతున్న తహసీల్దార్

కాకినాడ రూరల్: రెవెన్యూ సంబంధిత సమస్యలను తక్షణం పరిష్కరిస్తామని తహసీల్దార్ కుమారి అన్నారు. తిమ్మాపురం గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం రెవెన్యూ సదస్సు జరిగింది. భూ సంబంధిత, రెవెన్యూ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. మొత్తం 14 అర్జీలు వచ్చినట్టు ఆమె తెలిపారు. సదస్సులో భాగంగా క్షేత్ర స్థాయిలో ఎస్సీ పేట ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ వృద్ధురాలితో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెజవాత సత్యనారాయణ, డీటీ సురేష్, ఆర్ఐ, వీఆర్వోలు నున్న సత్యనారాయణ, రామకృష్ణ, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌లో దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: విద్యార్థులు సైనిక్ పాఠశాలల్లో చేరడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, 2025–26 విద్యా సంవత్సరంలో ఆరు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశాలకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఐదు, ఎనిమిది తరగతుల వారు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, రక్షణ శాఖలో పనిచేస్తున్న, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయించినట్టు వివరించారు. దీనికోసం ప్రవేశ పరీక్ష, వైద్య పరీక్షలలో అర్హత సాధించాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఇంటర్మీడియెట్ వరకు విద్య, వసతితో పాటు, ఎన్‌సీసీ, యోగా, చిత్రలేఖనం, సంగీతం, ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్ బాల్, క్రికెట్, ఈత, గుర్రపు స్వారీపై శిక్షణ ఉంటుందన్నారు. రాత పరీక్షకు రాజమహేంద్రవరం, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం పరీక్షా కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థులను వచ్చే ఏడాది జనవరి 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కరప మండల సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు

ఎం.అనుపమ, ఎంపీడీఓ 9346790319,
పెంకే శ్రీలక్ష్మి, ఎంపీపీ 9908778808

గ్రామం	సర్పంచ్		కార్యదర్శి	
అరట్లకట్ట	గోపి సత్యవేణి	7993605566	వై.రామ్‌జీ	7416299365
జి.భావారం	రొక్కాల గనిరాజు	9502319888	కె.సంతోష్ మహదేవశర్మ	9666731272
గొడ్డటిపాలెం	గోన అనూష	8247395677	పి.త్రిమూర్తులు	9912985999
గొర్రిపూడి	కానూరి రమాదేవి	6301293869	కేఎస్ఎస్ సుధారాణి	9441031469
			ఎస్.వీరబాబు	9959327477
కరప	సాదే ఆశాజ్యోతి	9532066467	యు.నిర్మలాదేవి	9705687699
కొరిపల్లి	పలివెల నాగేశ్వరరావు	9666375249	ఆర్.సుబ్బలక్ష్మి	9640833799
కూరాడ	రావుల సూర్యచంద్రావతి	9014124070	ఎం.దుర్గాప్రసాద్	9494894376
నడకుదురు	దేగల లలితకుమారి	9666566235	వి.గోపాలకృష్ణ	9491369021
			కె.వరిజ	9676476445
పాతర్లగడ్డ	నాగిరెడ్డి ఏసుబాబు	9948445419	పి.సుధాకర్	8309460718
పెదకొత్తూరు	చింతా నాగలక్ష్మి	9848295290	పి.సునీల్	9705804540
పెద్దాపురప్పాడు	బిరుదా సరస్వతి	7993903954	ఎం.వీరభద్రరావు	9248356675
సిరిపురం	నున్న సుజాత	9989417657	డి.దుర్గాభవాని	9491729558
వాకాడ	అడబాల సత్య	9951975888	పి.సునీల్	9705804540
వలసపాకల	వాసంశెట్టి రామారావు	9553395145	ఎం.విజయలక్ష్మి	9912495319
వేళంగి	సవిలే నీలిమ	8790503563	పి.వీరభద్రరావు	7702400927
విజయరాయుడుపాలెం	వి.సీతారామరాఘవ	9182824192	ఎస్.వీరబాబు	9959327477
యండమూరు	మార్రెళ్ల శ్రీనివాసరావు	8688433626	పిఎస్‌వీఆర్ బ్రహ్మానందం	9912697957
జెడ్.భావారం	కొత్త నాగలక్ష్మి	9014074678	వి.శ్రీదేవి	9490710952
పెనుగుదురు	రెడ్డిపల్లి వెంకటమాధవి	8498033555	బి.చంద్రకళ	7036554234
గురజనాపల్లి	అనుసూరి శ్రీనివాసరావు	9640273737	ఎంవీఎస్ఎస్ఎన్ సురేష్	9949859045
కొంగోడు	నక్కా అప్పలస్వామి	9494106999	పి.వీరభద్రరావు	7702400927
వేములవాడ	కమిడి మంగాదేవి	9959570866	పి.ఉమామహేశ్వరి	9848914135
ఉప్పలంక	బొమ్మిడి నయోమి	6305247836	ఎం.భవాని	7989606142